క్లుప్తంగా

వచ్చే నెల 3 లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

రంగంపేట: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మే 3వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24వ తేదీ నుంచి మే 30వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు పరీక్షలకు హాజరవడానికి పరీక్ష ఫీజు కళాశాలలో చెల్లించాలన్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు ఎన్ని సబ్జెక్టులైనా రూ.520, ప్రథమ, ద్వితీయ రెండూ రాసే విద్యార్థులు రూ.1030 కట్టాల్సి ఉంటుందన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌గా రామారావు



కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకుంటున్న రామారావు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు వీఆర్వోగా సేవలందిస్తున్న పంపన రామారావు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. శుక్రవారం ఈ మేరకు ఆయన కాకినాడలో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకున్నారు. రామారావుకు పలువురు రెవెన్యూ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ



పందలపాకలో అంబేడ్కర్ కాంస్య విగ్రహం

బిక్కవోలు: మండలంలోని పందలపాక ఎస్సీ పేట వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 12 అడుగుల కాంస్య విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ యువత, నాయకులు కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులులర్పించారు.

సచివాలయాల్లో రికార్డుల పరిశీలన



ఆన్‌లైన్ రికార్డులు పరిశీలిస్తున్న నియోజకవర్గ ప్రత్యేక అధికారి నాగార్జునరెడ్డి

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలోని సచివాలయం-1, సచివాలయం-2, ఆర్‌బీకేల్లోని రికార్డులను నియోజకవర్గ ప్రత్యేక అధికారి నాగార్జునరెడ్డి శుక్రవారం పరిశీలించారు. వెల్ఫేర్ అసిస్టెంట్‌కు ప్రభుత్వ పథకాలపై ఎంత పట్టుందో పరీక్షించారు. అలాగే డిజిటల్ అసిస్టెంట్ రోజుకు కనీసం 20 సర్వీసు రిక్వెస్టులు చేయాలన్నారు. అనంతరం స్థానిక ఆర్‌బీకేకు వెళ్లి ధాన్యం కొనుగోళ్లు పరిశీలించి ఆర్‌బీకే సిబ్బంది శ్రీనివాస్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

పలువురికి వైద్యసేవలు



పురుషోత్తపట్నంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు వైద్య సేవలు అందించారు. మంచంపై ఉన్న రోగుల వద్దకు నేరుగా వెళ్లి వైద్యం చేశారు. స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు.

రెండు బైకుల చోరీ

బిక్కవోలు: మండలంలోని వివిధ గ్రామాల్లో రెండు బైకుల చోరీపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బిక్కవోలు గ్రామానికి చెందిన జంపా సుబ్రహ్మణ్యం పొలం గట్టు వద్ద బైకు ఉంచి చేలోకి వెళ్లి తిరిగొచ్చి చూసేసరికి కనిపించలేదు. ఊలపల్లికి చెందిన తంగెళ్ల సునీల్‌జార్జి ఇంటి బయట ఉంచిన బైకు మాయమైంది. బాధితుల ఫిర్యాదులతో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

తీయని ఫలం.. చేదు నిజం

- పండ్లను రసాయనాలతో మగ్గబెట్టేస్తున్న వ్యాపారులు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



బిక్కవోలు: మామిడి, అరటి, ఆపిల్, సపోటా, దానిమ్మ, ద్రాక్ష, పుచ్చ, బొప్పాయి.. నిగనిగలాడుతూ నోరూరించే పండ్లను ఇష్టపడనివారు ఎవరుంటారు. పైగా పండ్లు తింటే ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు సూచిస్తుంటారు. అయితే మార్కెట్‌లో దొరుకుతున్న పండ్లలో వేటిని సహజసిద్ధంగా పక్వానికి వచ్చాయో, వేటిని రసాయనాలతో మగ్గబెట్టారో తెలుసుకోవడం కష్టం. వ్యాపారులు మాత్రం లాభార్జనే ధ్యేయంగా రసాయనాలు వినియోగించి ప్రజలకు విక్రయిస్తున్నారు. సహజసిద్ధంగా పండిన ఫలాల్లో మాత్రమే పోషకాలు ఉంటాయని, పక్వానికి రాని పండ్లను కృతిమ పద్ధతుల్లో రసాయనాలను వినియోగించి మగ్గబెట్టిన పండ్లను తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

క్షేత్రస్థాయిలో కరవైన నిఘా

వేసవి సీజన్‌లో ప్రజలు మామిడి కాయల్ని ఇష్టంగా తింటుంటారు. వ్యాపారులు మామిడి పక్వానికి రాక ముందే తోటల్లోనే కార్బైడ్, ఇథనాల్ వంటి రసాయనాల్లో ముంచి పచ్చికాయలను పండ్లుగా మార్చి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి అయ్యే మామిడి పండ్లలోనైతే అక్కడ వాహనాలకు ఎక్కించేటప్పుడే పెట్టెల్లో కార్బైడ్ పొట్లాలను పెట్టి పంపిస్తున్నారు. ఒక్క మామిడి పండ్లే కాకుండా అరటి, ఆపిల్ పండ్లపై సైతం రసాయనాలు చల్లేస్తున్నారు. పుచ్చ, బొప్పాయి పండ్లకు ఇంజెక్షన్లు చేసి పండిస్తున్న ఉదంతాలు సైతం ఉన్నాయి. అలాంటి పండ్లను తినడం వల్ల క్యాన్సర్ లాంటి ప్రమాదకర వ్యాధులు వచ్చే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అందుకే దూరప్రాంతాల నుంచి వచ్చే పండ్లు కాకుండా స్థానికంగా దొరికే పండ్లను తీసుకోవడం మేలని సూచిస్తున్నారు. అంతేకాదు ఇంటికి తీసుకొచ్చే పండ్లను ఉప్పు నీటిలో కాసేపు ఉంచి కడిగిన తరువాతే తినడం మంచిదంటున్నారు. పండ్లపై కార్బైడ్ వాడకాన్ని ప్రభుత్వం నిషేధించానా, కోర్టులు ఆదేశించినా క్షేత్ర స్థాయిలో వాటిని అమలు చేసేవారు కరవయ్యారు. అధికారుల తీరు రసాయనాలతో పండ్లను మగ్గబెట్టి విక్రయించే వ్యాపారులకు కలిసొస్తుంది.

రసాయనాలతో ఆరోగ్యానికి ప్రమాదం



పండ్లు త్వరగా పక్వానికి రావడం కోసం వివిధ రసాయనాలు వినియోగిస్తుంటారు. అలాంటి పండ్లు తినడం వల్ల ఆరోగ్యానికి ప్రమాదకరం. జీర్ణ వ్యవస్థ దెబ్బతినడంతో పాటు అనేక ఆరోగ్య సమస్యలొస్తాయి. – డాక్టర్ విజయలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యురాలు, కొంకుదురు

ఇక నుంచి ఆర్‌డీఓ కార్యాలయంలో స్పందన



చైత్రవర్షిణి, ఆర్‌డీఓ

సీటీఆర్ఐ: ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని మే ఒకటో తేదీ సోమవారం నుంచి రాజమహేంద్రవరంలోని రెవెన్యూ డివిజన్ అధికారి (సబ్ కలెక్టర్) కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆర్డీవో ఏ.చైత్రవర్షిణి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజమహేంద్రవరం అర్బన్, రూరల్, కడియం, రాజానగరం, కోరుకొండ, సీతానగరం, గోకవరం, బిక్కవోలు, అనపర్తి, రంగంపేట మండలాల ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయాలని కోరారు.

కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ తల్లి

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లిలో ఉన్న కనకదుర్గమ్మ తల్లికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తుల కోసం అన్నసమారాధన నిర్వహించారు.

ప్రభుత్వ కళాశాలల విజయకేతనం

మధురపూడి/సీతానగరం: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు విజయ బావుటా ఎగురవేశారు. కార్పొరేట్ కాలేజీలకు దీటుగా ఫలితాలు సాధించారు. పేద, మధ్య తరగతి కుటుంబాల నుంచి వచ్చిన వీరు చదువులో సత్తా చాటారు. విద్యాభివృద్ధికి జగన్ ప్రభుత్వం చేస్తున్న కృషి, కల్పిస్తున్న వసతులు, అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని విజయదుందుభి మోగించారు.

అధ్యాపకుల ప్రోత్సాహం



తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల మంచి బోధనతో అత్యధిక మార్కులు సాధించాను. తండ్రి వీరబాబు కూలీ, తల్లి గృహిణి. బీఎస్సీ అగ్రికల్చర్ లేదా బీఎస్సీ నర్సింగ్ చేయాలని ఉంది. ఆర్థిక పరిస్థితిని బట్టి పైచదువులకు వెళతాను. బైపీసీలో 930 మార్కులు రావడం ఆనందంగా ఉంది.
– చీకట్ల యశస్వీ సుగుణ, రఘుదేవపురం, సీతానగరం జూనియర్ కాలేజీ

డాక్టర్ కావాలన్నదే లక్ష్యం



మాది కోరుకొండ మండలం శ్రీరంగపట్నం. నాన్న తాపీమేస్త్రీగా పనిచేస్తున్నారు. అధ్యాపకుల సూచనలతో పరీక్షల్లో మంచి మార్కులు సాధించాను. బైపీసీలో 959 మార్కులు వచ్చాయి. చాలా ఆనందంగా ఉంది.
– సిరిపల్లి జ్యోతి, కోరుకొండ జూనియర్ కాలేజీ

ఇంజినీరు అవుతా




ఇంజినీరు కావాలన్నదే నా లక్ష్యం. ఎంపీసీలో 955 మార్కులు వచ్చాయి. ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించి ఇంజినీరు చదువుతా. రాఘవపురం గ్రామానికి చెందిన మా నాన్న వ్యవసాయం చేస్తారు. నా చదువుకు తల్లిదండ్రులు, అధ్యాపకులు ఎంతో ప్రోత్సహించారు. – వెంకట రమా ప్రవీణ, కోరుకొండ జూనియర్ కాలేజీ

చార్టెడ్ అక్కౌంటెంట్ కావడమే లక్ష్యం



చార్టెడ్ అక్కౌంటెంట్ కావాలన్నదే లక్ష్యం. సీఈసీలో 894 మార్కులు సాధించాను. గోకవరం మండలం ఇటికాయలపల్లి మా స్వగ్రామం. నాన్న వ్యవసాయం చేస్తారు. అధ్యాపకులు, తల్లిదండ్రుల ప్రోత్సహిస్తున్నారు.
– పిల్లి లక్ష్మీదుర్గ, కోరుకొండ జూనియర్ కాలేజీ

పట్టుదలతో చదివాను



పట్టుదలతో చదివి ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 436 మార్కులు సాధించాను. మాది కోరుకొండ. నాన్న వ్యవసాయం చేస్తూ నన్ను చదివించారు. ఇష్టపడి చదవడంతో కష్టంగా ఉన్నా మంచి మార్కులు సాధించగలిగాను.
– పి.మణికంత, కోరుకొండ జూనియర్ కాలేజీ

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి శివారు ఊరచెరువు ప్రాంతంలో నిర్మిస్తున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు ఆదివారం నుంచి మే నాలుగు వరకూ నిర్వహించనున్నట్టు నిర్మాణ కర్త అనంతాత్ముల బాలాజీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. దైవజ్ఞులు తాళ్లూరి మఠాధిపతి శ్రీమాన్ పాడుగు వెంకట సత్యనారాయణ ప్రసాద ఆచార్యులు పర్యవేక్షణలో ప్రతిష్ఠోత్సవాలు జరుగుతాయన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కొత్తతుంగపాడులో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు
- కొత్తతుంగపాడులో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని కొత్తతుంగపాడులో శుక్రవారం సాయంత్రం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి, ప్రజల యోగక్షేమాలు తెలుసుకున్నారు. గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు ఏమేరకు ఆయా కుటుంబాలకు అందాయో లబ్ధిదారులకు వివరించారు. ఏవిధమైన సమస్యలున్నా నిర్భయంగా తెలియజేసి, వాటి పరిష్కారానికి సహకరించాలని కోరారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను తెలియజేశారు. సీఎం జగన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతిని వివరిస్తూ మరోసారి ప్రజాసంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి అవకాశం ఇవ్వాలని కోరారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పలకరించి, వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, సర్పంచ్‌ల సమాఖ్య మండల శాఖ అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, ఎంపీటీసీ లక్ష్మీపతి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, రౌతల శ్రీను పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కాకినాడ దిశ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుంకర శ్రీవల్లి

గోకవరం: మండలంలో పలు సమస్యలపై ఎంపీపీ సుంకర శ్రీవల్లి కాకినాడ దిశ సమావేశంలో ప్రస్తావించారు. గోకవరం నుంచి రంపయర్రంపాలెం వెళ్లే రహదారి పూర్తిగా ఛిద్రమైందని, నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఎంటీయూ 1156 రకం ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు క్వింటాలుకు ఎనిమిది కిలోల నుంచి 20 కిలోల వరకు రైతుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని, దీని వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కలెక్టర్ తక్షణమే స్పందిస్తూ ఎమ్‌టీయూ 1156 రకం ధాన్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన ధరకే కొనుగోలు చేయాలని, లేకపోతే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గోకవరంలో ఇళ్ల స్థలాలు రాని 800 మంది లబ్ధిదారులకు తంటికొండకు వెళ్లే మార్గంలో స్థలాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఈ సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

ఆదర్శ పాడి రైతులకు కలెక్టర్ సత్కారం



ఆదర్శ పాడి రైతు పోతుల బుల్లి వీర్రాజును సత్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత

రంగంపేట: రంగంపేట మండలం వడిశలేరు గ్రామానికి చెందిన పోతుల బుల్లి వీర్రాజు, నలమాటి సుబ్బారావులు ఆదర్శ పాడి రైతులుగా ఎంపికయ్యారు. శుక్రవారం ప్రపంచ పశు వైద్య దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆదర్శ పాడి రైతులు పోతుల బులి వీర్రాజు(గేదెల పెంపకం), నలమాటి సుబ్బారావు(ఆవుల పెంపకం)లను జిల్లా కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్‌లు ఘనంగా సత్కరించి మెమొంటోలు బహూకరించారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఎస్‌టీజీ సత్య గోవిందం, మండల పశు వైద్యాధికారి జాన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: కాతేరు నుంచి సీతానగరం వరకు చేపట్టిన నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కొన్నిచోట్ల సిమెంట్ డ్రైనేజీల నిర్మాణం జరుగుతోందన్నారు. రోడ్డు విస్తరణకు అడ్డంగా ఉన్న ఎలక్ట్రికల్ పోల్స్ తొలగించాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. బొబ్బిల్లంకలో ఒకవైపు సిమెంట్ రోడ్డు పనులు పూర్తయ్యాయని, రెండో వైపు పనులు కూడా త్వరలో పూర్తి చేయాలన్నారు. రోడ్డు పురోగతి పనుల విషయంలో ఎటువంటి జాప్యం జరగకూడదన్నారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ డీఈ మధుసూదనరావు, ఏఈ వీరన్నబాబు, కాంట్రాక్టర్ ఎంవీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

సీతానగరం: మిర్తిపాడు సబ్ స్టేషన్ ఫీడర్ వార్షిక మరమ్మతుల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ చంద్రమోహన్ తెలిపారు. మిర్తిపాడు, బొబ్బిల్లంక, ములకల్లంక గ్రామాలకు, మిర్తిపాడులోని వ్యవసాయ మోటార్లుకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

ఒకటి నుంచి టేబుల్ టెన్నిస్ శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ: వీరేశలింగం పురమందిరం (రాజమహేంద్రవరం టౌన్ హాల్) ఎదురుగా ఉన్న రాజమండ్రి గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీలో మే ఒకటి నుంచి 30వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు అకాడమీ అధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో టేబుల్ టెన్నిస్‌తో పాటు ఫిజికల్ ఫిట్‌నెస్, రోబో మిషన్‌పై తర్ఫీదు ఇస్తామనినారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు రెండు బ్యాచ్‌లుగా జరుగుతుందన్నారు. ఆసక్తి కలవారు 98663 77035, 93475 86233 నంబర్లను సంప్రదించాలన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

రాజానగరం: జీవితంలో విద్యార్థి దశ ఎంతో ఉన్నతమైనదని, దాన్ని సక్రమంగా వినియోగించుకుంటేనే భవిష్యత్తు బాగుంటుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి విద్యార్థులకు హితవు పలికారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, డిజేబుల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నియంత్రణపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలు, సంబంధిత చట్టాలు, న్యాయ సేవల గురించి వివరించారు. వీటిపై ఎటువంటి సమాచారం లేదా సహాయం కావాల్సినా 14500 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలన్నారు. సమావేశంలో డిజేబుల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ వి.కామరాజు, యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్, పోలీసు అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అనపర్తి: మండలంలోని అనపర్తి, కుతుకులూరు, పెదపర్తి గ్రామాల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ బీఎల్ నరసింహం తెలిపారు. మొత్తం ఐదు పోస్టులు ఖాళీలున్నాయన్నారు. అనపర్తి పరిధిలో ఖాళీగా ఉన్న రెండు వలంటీర్ పోస్టులకు ఓసీ-మహిళ, బీసీ-పురుష, కుతుకులూరు ఎస్సీ-మహిళ, ఓసీ-పురుష, పెదపర్తి ఓసీ-పురుషకు రిజర్వు చేశారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మే నెల 1వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఆ కాపీని సదరు పంచాయతీ కార్యదర్శికి అందజేయాలని ఎంపీడీఓ సూచించారు.

డ్రిప్ పరికరాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: రాయితీపై డ్రిప్ పరికరాలు అందించడానికి రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా సూక్ష్మసేద్య అధికారి ఎస్.రామ్‌మోహన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలవారు సమీపంలోని రైతు భరోసా కేంద్రాలను సంప్రదించి, వీహెచ్ఏ/ వీఏఏల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఆయా మండలాల ఉద్యానఅధికారులు, మైక్రో ఇరిగేషన్ కంపెనీ ప్రతినిధులను సంప్రదించాలన్నారు. ఉద్యానాధికారుల ఫోన్ నంబరు మండలాల వారీగా.. నల్లజర్ల 79950 86870, దేవరపల్లి, నిడదవోలు, గోపాలపురం 79950 86871, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి, ఉండ్రాజవరం, పెరవలి 79950 86861, అనపర్తి, రంగంపేట, బిక్కవోలు, రాజానగరం 79950 86841, కోరుకొండ, గోకవరం, సీతానగరం 79950 86840, కడియం, రాజమహేంద్రవరం రూరల్ 79950 86839.

జగన్ పాలనలో పేదలందరికీ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి

- పంచాయతీరాజ్ శాఖ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి
- అభివృద్ధి పనుల పరిశీలన

రాజానగరం: రాష్ట్రంలో ప్రజలందరికీ మేలు జరగాలని, ప్రభుత్వం అందించే పథకాలు సక్రమంగా అందాలనే ఆశయంతో సీఎం జగన్ గ్రామ/వార్డు సచివాలయల వ్యవస్థను ఏర్పాటు చేశారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి అన్నారు. ఈ వ్యవస్థలో ఉన్న మీరంతా ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా పనిచేయాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మండలంలో వివిధ గ్రామాలలో జరిగిన అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఆయా శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లలతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రజలకు మెరుగైన సేవలందించడంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులను, నాయకులను కూడా గౌరవించాలన్నారు.

సచివాలయ వ్యవస్థ ఉండాలంటే..

గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ కొనసాగాలన్నా, ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నా జగన్ మరోసారి సీఎం కావాలని పంచాయతీరాజ్ శాఖ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి అన్నారు. పొరబాటున వేరొకరు అధికారంలోకి వస్తే గ్రామ/వార్డు సచివాలయం, గ్రామ/వార్డు వలంటీర్ల వ్యవస్థలు ఉండవన్నారు. తండ్రిని మించిన తనయుడిగా సీఎం జగన్ ప్రజారంజక పాలన అందిస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో 98 శాతం పైబడి నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం జగన్ మరోసారి సీఎం కావాలని, ఇక్కడ నుండి జక్కంపూడి రాజా రెండోసారి ఎమ్మెల్యేగా గెలవాలని ఆకాంక్షించారు.

విద్యార్థులకు చదువుతో పాటు ఇంటర్న్‌షిప్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ నరసింహులు

సీటీఆర్ఐ: రాష్ట్ర ప్రభుత్వం యువతకు మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చదువుతో పాటు ఇంటర్న్‌షిప్ కార్యక్రమానికి రూపకల్పన చేసిందని జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు అన్నారు. డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులకు సంబంధించి ఆరునెలల ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంపై శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వికాస కేంద్రం కూడా ఈ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఆయా కాలేజీలకు అందజేస్తూ, అనుసంధాన కర్తగా వ్యవహరిస్తోందన్నారు. సమావేశంలో వికాస పీడీ లచ్చారావు, జీఎం ఇండస్ట్రీస్ కె.వెంకటేశ్వర రావు, రాజమహేంద్రవరం వికాస మేనేజర్ సత్యనారాయణ, ఇంటర్న్‌షిప్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.